సాక్షి
తిరుపతి
గురువారం । 10 । ఆగస్టు । 2023



కావళ్లు..భక్తి పరవళ్లు!

తిరుపతి జిల్లాలో ఆడికృత్తిక మహోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు కావళ్లు మోసి మొక్కులు తీర్చుకున్నారు. - IIలో



వందేభారత్ రైలులో పొగలు

తిరుపతి నుంచి సికింద్రాబాద్ వెళుతున్న వందే భారత్ రైల్లోంచి పొగలు రావడంతో మనుబోలు వద్ద రైలును ఆపివేశారు. - IIలో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	34	26
చిత్తూరు	34	24
తిరుమల	29	21
గూడూరు	7	27
నగరి	35	26



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి. పక్కన టీటీడీ నూతన చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

అధినేత దీవెనలు..

వెంకన్న ఆశీస్సులు!

తిరుపతి మంగళం: సంకల్పం ఉంటే ఏదైనా సాధించొచ్చు. దైవభక్తి ఉంటే ఆ స్వామి సేవలోనే తరించవచ్చు. భక్తులకూ తనవంతు సేవలందించవచ్చు. ఇవి తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి జీవితంలో తారసపడ్డాయి. తమ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దీవెనలకు తోడు కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వరుడి ఆశీస్సులు తోడవడంతో ఆయన మరోసారి టీటీడీ చైర్మన్‌గా ఎంపికయ్యారు. గురువారం ఉదయం 11.44 తిరుమలలోని నిమిషాలకు గరుడ ఆళ్వార్ సన్నిధిలో ఆయన టీటీడీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇదిలావుండగా.. భూమన బుధవారం తాడేపల్లెలోని సీఎం క్యాంప్ ఆఫీసులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట తిరుపతి డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్: అన్నదాతలు ఈ నెల 31వ తేదీ లోపు బిందు సేద్యం సబ్సిడీ పరికరాలకు దరఖాస్తు చేసుకోవాలని సూక్ష్మసేద్య పథకం జిల్లా అధికారి సతీష్ పేర్కొన్నారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లోని తమ చాంబర్‌లో మాట్లాడుతూ డ్రిప్, స్ప్రింకర్లను రైతులకు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున సబ్సిడీ పరికరాలను అందిస్తోందన్నారు. ప్రధానంగా డ్రిప్‌కు సంబంధించి 5 ఎకరాలలోపు సాగుచేస్తున్న రైతులకు ఇచ్చే పరికరాల్లో 90 శాతం, 5 ఎకరాలు పైన, 10 ఎకరాల లోపు సేద్యం చేస్తున్న రైతులకు 70 శాతం రాయితీ ఉంటుందన్నారు.


జగనన్న విద్యా, వసతి దీవెనలకు రిజిస్ట్రేషన్లు

తిరుపతి అర్బన్: అర్హత కల్గిన వారు జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన పథకాలకు రెన్యూవల్, రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారిత అధికారి చెన్నయ్య బుధవారం తెలిపారు. సెప్టెంబర్ 10వ తేదీ వరకు మాత్రమే గడువు ఉందన్నారు. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి అర్హులైన విద్యార్థులు వారు చదువుతున్న కళాశాలలో లాగిన్ ద్వారా రెన్యూవల్, రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు


వందే భారత్ రైలులో పొగలు

- మనుబోలు స్టేషన్‌లో 30 నిమిషాలు నిలిపివేత
- తాగిపడేసిన సిగరెట్ ప్లాస్టిక్ వస్తువులకు అంటుకున్నట్లు గుర్తింపు

మనుబోలు(శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా): తిరుపతి నుంచి సికింద్రాబాద్ వెళుతున్న వందే భారత్ రైల్లోంచి హఠాత్తుగా పొగలు రావడంతో ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా మనుబోలు వద్ద రైలును 30 నిమిషాలు ఆపివేసిన ఘటన బుధవారం జరిగింది. సాయంత్రం ఐదు గంటల సమయంలో రైలు మనుబోలు స్టేషన్ సమీపంలోకి వస్తుండగా ఓ బోగిలో నుంచి పొగలు రావడాన్ని గుర్తించిన అధికారులు రైలును స్టేషన్‌లో నిలిపివేశారు. ఒక్కసారిగా రైలు ఆగిపోవడంతో ప్రయాణికులు భయభ్రాంతులకు గురై కిందకు దిగేశారు. 3వ భోగీ బాత్‌రూం నుంచి పొగలు వస్తున్నాయని తెలుసుకుని సిబ్బంది వెళ్లి పరిశీలించారు. ఎవరో సిగరెట్ తాగి పడేయడంతో ప్లాస్టిక్ వస్తువులకు అంటుకుని పొగలు వచ్చినట్లు గుర్తించారు. టికెట్ లేకుండా ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి ఆ పని చేసి ఉంటాడని అనుమానిస్తూ పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. అరగంట తర్వాత రైలు బయలుదేరింది.



కావళ్లు..భక్తి పరవళ్లు!


పిచ్చాటూరులో తెప్పోత్సవం


తిరుపతి తనపల్లె గుట్టపై కావళ్లతో భక్తులు

- వైభవంగా ఆడికృత్తిక మహోత్సవం
- కావళ్లు మోసి మొక్కులు చెల్లించిన భక్తులు

పిచ్చాటూరు: జిల్లాలో ఆడికృత్తిక మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. హరో..హర ధ్వనులతో కుమార గిరులు పులకించాయి. కావళ్లు మోసి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. పిచ్చాటూరు మండలం, రామగిరి శ్రీముత్తుకుమార స్వామి ఆలయంలో ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రాత్రి శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి తెప్పలపై ఊరేగుతూ భక్తులను కనువిందు చేశారు. ఉదయం మూలవర్లకు కృత్తిక అభిషేకాలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం నుంచి వేలాది మంది భక్తులు ఆలయానికి చేరుకొని కావళ్లు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి పుష్కరిణిలో తెప్పలపై విహరిస్తూ స్వామి,అమ్మవార్లు కనువిందు చేశారు. భక్తులు రాత్రంతా ఆలయ ప్రాంగణంలో జాగారం చేశారు. ఆలయ చైర్మన్ వెంకటేశ్వర్లు, ఈఓ లత ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసులు, సత్యవేడు సీఐలు సురేష్‌కుమార్, శివకుమార్ రెడ్డితో పోలీసు సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలాగే శ్రీకాళహస్తి, చంద్రగిరి, తిరుపతి రూరల్, గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట తదితర మండలాల్లోనూ భక్తులు కావళ్లు మోసి మొక్కులు చెల్లించారు.


శ్రీకాళహస్తి విజ్ఞానగిరిపై భక్తుల సందడి


శ్రీకాళహస్తీశ్వరాలయంలో శ్రీవళ్లీ దేవసేన సమేత చెంగల్రాయ స్వామి ఊరేగింపు


రామగిరిలో కావళ్లతో పోటెత్తిన భక్తులు

సీబీఏ ప్రశ్నపత్రాల డీడీని 14 లోపు సమర్పించాలి

తిరుపతి ఎడ్యుకేషన్: 2023–24 విద్యాసంవత్సర ఎఫ్ ఏ, ఎస్ఏ ప్రశ్నపత్రాలకు సంబంధించిన కోటామని డీడీలను జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఈ నెల 14వ తేదీలోపు సమర్పించాలని కామన్ ఎగ్జామినేషన్స్ బోర్డు సెక్రటరీ వంశీరాజ్ తెలిపారు. 1 నుంచి 5వ తరగతి వారికి ఒక్కో విద్యార్థికి రూ.150, 6 నుంచి 10వ తరగతి వారికి ఒక్కో విద్యార్థికి రూ.200 చొప్పున చైల్డ్ ఇన్ఫో ప్రకారం డీసీఈబీ సెక్రటరీ(తిరుపతి) పేరున డీడీని తీసి అందించాలని తెలిపారు. వివరాలకు 94931 27174 నంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.

‘ఉపాధి’లో డీవీ సత్రం ఫస్ట్

దొరవారిసత్రం: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనిదినాలు కల్పించడంలో వరుసగా (ఏప్రిల్ నుంచి జూలై) దొరవారిసత్రం మండలం మొదటి స్థానంలో నిలిచింది. ఈ మేరకు స్థానిక ఎంపీడీఓ సింగయ్య మాట్లాడుతూ జూలైలో కూడా డీవీ సత్రం మండలం తిరుపతి జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. మండల పరిధిలో 6,320 కుటుంబాలకుగాను 1,13,739 పనిదినాలు కల్పించినట్టు ఆయన వెల్లడించారు.

ఓటర్ల జాబితా సవరణ 70 శాతం పూర్తి


సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టర్

తిరుపతి అర్బన్: ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ-2024కి సంబంధించి 70 శాతం గృహాల సర్వే పూర్తిచేశామని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో ఓటర్ల జాబితాపై రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. బీఎల్‌వోలు ఈనెల 21వ తేదీకి వంద శాతం గృహాలను సందర్శించి జాబితాను తయారు చేయాలని చెప్పారు. సమీక్షలో వివిధ పార్టీల ప్రతినిధులు చంద్రశేఖర్, సుధారెడ్డి, ఐఎన్‌సీ చింతామోహన్, ఈఆర్వోలు గూడూరు -కిరణ్‌కుమార్, వెంకటగిరి-కోదండరామిరెడ్డి, శ్రీకాళహస్తి- రామారావు, ఏఈఆర్‌వోలు వెంకటరమణ,శిరీషా,ఎన్నికల తహసీల్దార్ సురేష్, డెప్యూటీ తహసీల్దార్లు కిరణ్మయి, కిరణ్ పాల్గొన్నారు.

11 నుంచి పాలిసెట్ వెబ్ ఆప్షన్స్

తిరుపతి ఎడ్యుకేషన్: పాలిసెట్‌లో అర్హత సాధించి సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకున్న విద్యార్థులు ఈనెల 11 నుంచి 14వ తేదీలోపు వెబ్ ఆప్షన్స్ నమోదు చేసుకోవాలని తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్, పాలిసెట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. వెబ్ ఆప్షన్ చేసుకున్న వారు 16న ఆప్షన్స్‌లో మార్పులు, చేర్పులు చేసుకోవచ్చని, 18న సీటు అలాట్‌మెంట్ ఉంటుందని, 23వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

శుభమస్తు..కల్యాణమస్తు!

- అట్టహాసంగా వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా
- జిల్లాలో 460 జంటలకు రూ.3.81 కోట్లు
- హాజరైన డెప్యూటీ సీఎం నారాయణస్వామి


చెక్కును అందజేస్తున్న డెప్యూటీ సీఎం నారాయణస్వామి, ఇన్‌చార్జ్ కలెక్టర్ డీకే బాలాజీ

తిరుపతి అర్బన్: వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా కార్యక్రమాన్ని బుధవారం కలెక్టరేట్‌లో అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి నుంచి ప్రారంభించగా.. అదే సందర్భంలో స్థానిక కలెక్టరేట్‌లో లబ్ధిదారులు, అధికారులు, నేతలు కార్యక్రమాన్ని వీక్షించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డెప్యూటీ సీఎం కే నారాయణస్వామి మాట్లాడుతూ ఏప్రిల్- జూన్ 2023 త్రైమాసికానికి జిల్లాలో వివాహం చేసుకున్న అర్హులైన 460 జంటలకు రూ.3.81 కోట్లు అందించినట్లు వెల్లడించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలను చదివించడమే కాకుండా పిల్లల వివాహాన్ని గౌరవప్రదంగా నిర్వహించేందుకు వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా ప్రవేశపెట్టారని చెప్పారు. ఇన్‌చార్జ్ కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ ఆడ పిల్లల కోసం ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించి బాగా చదివించాలని చెప్పారు. జిల్లాలో 460 జంటల తల్లుల ఖాతాలకు రూ.3,81,15,000 జమ చేసినట్టు వెల్లడించారు. అనంతరం లబ్ధిదారులకు మెగా చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట ఆర్డీఓ చంద్రముని, ఎస్సీ సంక్షేమ సాధికారిత అధికారి చెన్నయ్య, డీఆర్‌డీఏ పీడీ జ్యోతి, మెప్మా పీడీ రాధమ్మ, అధికారులు పాల్గొన్నారు.

వెంకటగిరి సచివాలయంపై ఏసీబీ దాడి

- రూ.20వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వార్డు అడ్మిన్ సెక్రటరీ


తీసుకుంటూ పట్టుబడిన వార్డు అడ్మిన్ సెక్రటరీ ఎంవీప్రసాద్, మున్సిపల్ ఆర్ఐ

వెంకటగిరి: వెంకటగిరి పట్టణం, 7వ వార్డు సచివాలయంపై బుధవారం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. 7వ వార్డు సచివాలయ వార్డు అడ్మిన్ సెక్రటరీ ముత్యాల వెంకటప్రసాద్‌రావు రూ.20 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. అతని నుంచి నగదును సీజ్ చేశారు. తిరుపతి ఏసీబీ అడిషనల్ ఎస్పీ దేవప్రసాద్ తెలిపిన వివరాలు .. వెంకటగిరికి చెందిన కొత్త నాగరాజు భార్య, మరదలుకు ఆయన అత్త తన పేరుమీద ఉన్న ఇంటిని 2021లో రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. ఈ రిజిస్ట్రేషన్ల ఆధారంగా ఆ ఇంటి అస్తులను మ్యూటేషన్, అసెస్‌మెంట్ దరఖాస్తుల కోసం 7వ వార్డు అడ్మిన్ సెక్రటరీ ఎంవీ ప్రసాద్, మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కోటీశ్వరరావును సంప్రదించగా వారు రూ.20 వేలు డిమాండ్ చేశారు. ఆ నగదు ఇస్తేనే అసెస్‌మెంట్, మ్యూటేషన్ చేస్తామని చెప్పడంతో బాధితుడు నాగరాజు, ఆయన భార్య స్పందనలో ఏసీబీ 14400 కాల్ సెంటర్‌కు ఫిర్యాదు చేశారు. బుధవారం 7వ వార్డు సచివాలయంలో వార్డు అడ్మిన్ ఎంవీ ప్రసాద్‌కు ఆ మొత్తాన్ని ఇవ్వగానే అప్పటికే అక్కడ మాటువేసిన ఏసీబీ అధికారులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి రూ.20వేలు స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఐ కోటీశ్వరరావును కూడా అదుపులోకి తీసుకున్నామని, నిందితులను అవినీతి నిరోధకశాఖ ప్రత్యేక న్యాయ స్థానంలో హాజరుపరుస్తామని పేర్కొన్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

తిరుపతి క్రైం: తిరుపతి-రేణిగుంట మార్గంలోని తిరుచానూరు రైల్వే స్టేషన్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి రైలు కిందపడి మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం.. సుమారు 40 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి రైలు కింద పడి మృతి చెందాడు. మృతుడికి సంబంధించిన ఎలాంటి ఆనవాళ్లు లభించలేదని, ఆచూకీ తెలిస్తే 0877225343 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

జిల్లా జూడో జట్టు ఎంపిక పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న జెన్ అకాడమీ ప్రతినిధులు

తిరుపతి ఎడ్యుకేషన్ : చిత్తూరు జిల్లా జూనియర్, సీనియర్ బాలబాలికల జూడో జట్ల ఎంపిక పోటీలను బుధవారం తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో నిర్వహించారు. ఈ పోటీలను తిరుపతి జిల్లా జూడో సంఘం జెన్ అకాడమీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు రాజేష్, భానుప్రకాష్‌రెడ్డి, కార్యదర్శి సీ.కిరణ్ ప్రారంభించారు. ఈ నెల 11న తుదీ తుది పోటీలు నిర్వహించి జిల్లా జట్లను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. జిల్లా తరపున ఎంపికైన జట్లు నెల్లూరులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి జూనియర్, సీనియర్ ఓపెన్ సెలెక్షన్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ ఎంపిక పోటీలకు డీఎస్ఏ జూడో కోచ్ గోపి, పీఈటీ కుసుమకుమారి, మల్లీశ్వరి, శివ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

రోడ్డు ప్రమాదంలో వలంటీరు మృతి


మృతుడు శ్రీనివాసులురెడ్డి

శ్రీకాళహస్తి: రోడ్డు ప్రమాదంలో వలంటీరు మల్లెంబాకం శ్రీనివాసులురెడ్డి(29) మృతి చెందిన ఘటన శ్రీకాళహస్తిలో బుధవారం చోటుచేసుకుంది. రెండవ పట్టణ పోలీసుల కథనం మేరకు.. శ్రీకాళహస్తి పట్టణం, ముత్తరాశిపాళెంకు చెందిన మల్లెంబాకం శ్రీనివాసులురెడ్డి 4వ వార్డు సచివాలయ పరిధిలో వలంటీరుగా పనిచేస్తున్నారు. బుధవారం సొంత పనుల నిమిత్తం తన స్నేహితుడు సురేష్‌ను వెంటబెట్టుకుని బసవయ్యపాళెంకు బయలుదేరాడు. తెట్టు కూడలి వద్ద వీరి ద్విచక్ర వాహనం అదుపుతప్పి గంగమ్మ హద్దురాయి మండపాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీనివాసులురెడ్డి, సురేష్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారంతో 108 వాహనం ద్వారా శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే శ్రీనివాసులురెడ్డి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తీవ్రంగా గాయపడిన సురేష్‌ను తిరుపతి రుయాకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

18 టూరిజం క్లస్టర్లకు ప్రతిపాదనలు


సమావేశంలో ఎమ్మెల్యేలు సంజీవయ్య, వరప్రసాద్‌రావు

తిరుపతి అర్బన్: జిల్లాలోని సముద్రతీర ప్రాంతంలో పర్యాటకుల కోసం 18 టూరిజం బీచ్ క్లస్టర్లు ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు ఇన్‌చార్జి కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో కోస్టల్ జోన్ మాస్టర్ ప్లాన్ 2019పై జిల్లా టూరిజం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, వెలగపల్లి వరప్రసాద్‌రావు, డీఆర్వో కోదండరామిరెడ్డి, ఆర్డీఓ చంద్రముని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ కోస్టల్‌జోన్ మాస్టర్ ప్లాన్ -2019 మేరకు జిల్లాలో సముద్రతీరాన పర్యాటకులను 18 బీచ్ టూరిజం క్లస్టర్లకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే కిలివేటి మాట్లాడుతూ గతంలో నిర్మించిన బీవీ పురం, నేలపట్టు గెస్ట్ హౌస్‌లను త్వరగా వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. టూరిజం అధికారి రమణప్రసాద్, ఆర్కియాలజీ ఏడీ శివప్రసాద్, ఫిషరీస్ ఏడీ శ్రీనివాస నాయక్, ఏటీఓ ఉమాపతి పాల్గొన్నారు.